


# ఇశ్రాయేలు దేశము

టి.పి. వరప్రసాద రెడ్డి



ఈనాటి యెరూషలేము

# ఇశ్రాయేలు దేశము

-: రచయిత :-

**టి.పి. వరప్రసాద రెడ్డి**

ప్రచురణ

**గాస్పెల్ అసెంబ్లి పబ్లిషింగ్స్**

డోర్ నెం. 7-270, కోర్టు రోడ్డు

అనంతపూర్ - 515 001

ఫోన్ : (08554) 275070

సెల్ : 9440285883

ప్రథమ ముద్రణ : డిసెంబరు 2004

రెండవ ముద్రణ : సెప్టెంబర్ 2005

**వెల రూ. 15-00**

*No part of our Publications may be Reprinted without our written Permission*

**Designed & Type Setting :**

*Logos Graphics,*

Rajendra Nagar 3rd Line,

GUNTUR - 522 006 Ph : 2230827


**Printed at :**

*Don Bosco Hi-Tech Printing Press,*

GUNTUR. Ph : 2350832

# ఇందులోని పట్టణాలు - ప్రాంతాలు


1. టెలివివ్ .................... 8
2. యెరూషలేము .................... 8,20
3. హైఫా .................... 8
4. బెత్లేహేము పట్టణం .................... 9
5. బేతనియ .................... 10
6. యెరికో పట్టణము .................... 10
7. యొప్పే పట్టణము .................... 10
8. కైసరయ .................... 11
9. గలిలయలోని నజరేతు .................... 12
10. తాబోరుకొండ .................... 12
11. గలిలయలోని కపెర్నహూము .................... 13
12. గలిలయలోని కానా .................... 14
13. యేసు ప్రసంగించిన ధన్యతల కొండ .................... 14
14. బెత్సయిదా .................... 15
15. గలిలయ సముద్రము .................... 15
16. యొర్ధాను నది .................... 16
17. కొమరాను గుహలు .................... 18
18. మృత సముద్రము .................... 18


ఇశ్రాయేలు దేశము
మధ్యధరా సముద్రము
సీదోను
సారెపతు
లెబానోను పర్వతము
హెర్మోను పర్వతము
దమస్కు
తూరు
ఫిలిప్పుదైన కైసరయ
గలిలయ
కొరాజీను
కపెర్నహూము
తొలెమాయి
మగ్దల
గలిలయ సముద్రము
కర్మెలు పర్వతము
కానా
గెరాస
తిబెరియ
నజరేతు
నాయీను
దెకపొలి
కైసరయ
సమరయ
సమరయ
సుకారు
షెకెము
యొప్పే
అరిమతయియ
లుద్ద
ఎఫ్రాయిము
బేతేలు
బేతని
ఎమ్మాయు
యెరికో
యెరూషలేము
పెరయ
బెతనియ
బేత్లెహేము
అష్కెలోను
యూదయ
హెబ్రోను
గాజా
మృత సముద్రము
ఇదూమయ
ఉత్తరము
క్రొత్త నిబంధన కాలపు పాలస్తీన
మైళ్ల కొలత
5 10 20 40 60

# ఇశ్రాయేలు దేశపు వివరాలు

ఇశ్రాయేలు దేశము భారతదేశములోని బొంబాయి పట్టణం నుండి 2500 మైళ్లు (4000 కి.మీ) నిటారు దూరమున కలదు. కాని ప్రయాణ మార్గము చుట్టు అయినందున ప్రయాణ దూరము షుమారు 3,400 మైళ్లు (5,500 కి.మీ) ఉండును. విమానం గంటకు 550 మైళ్లు వేగములో (850 కి.మీ) భూమిపైన 10 కి.మీ. ఎత్తున పయనించును. గంటకు 500 మైళ్ళు సగటు వేగమున ప్రయాణం షుమారు 7 గంటల కాలము పట్టును. విమానం పైకి ఎగురుటకు అరగంట, పై నుండి క్రిందికి దిగుటకు సుమారు అరగంట పట్టును గనుక ప్రయాణం మొత్తం సుమారు 8 గంటలు పడుతుంది. ఇశ్రాయేలు దేశము భారతదేశమునకు పడమటి వైపు ఉన్నందున ఇశ్రాయేలు దేశమందు సూర్యుడు మూడున్నరగంటలు ఆలస్యంగా ఉదయించును. భారత దేశమునకు ఇశ్రాయేలు దేశమునకు కాలము మూడున్నర గంటల తేడా ఉండును.

ప్రస్తుతం ఇశ్రాయేలు దేశము 240 మైళ్ళు (380 కి.మీ) పొడవు మరియు 50 మైళ్ళు (80 కి.మీ) వెడల్పు కలిగి ఉన్నది అనగా 12 వేల చ. మైళ్ళు విస్తీర్ణం కలిగి ఉన్నది. తూర్పున అరేబియా ఎడారి, పడమరన మధ్యధరా సముద్రము, దక్షణమున సీనాయి అరణ్యము, ఉత్తరమున లెబానోను హెర్మోను పర్వతములు కలవు. ఇశ్రాయేలు దేశము ఆసియా, ఆఫ్రికా ఖండములు కలియుచోట ఉన్నందున ఆ రెండు ఖండములను ఈ దేశము వంతెనవలె కలుపును అందురు. ప్రభువైన యేసు దినములలో ఇశ్రాయేలు దేశము పైనుండి క్రిందికి 1. గలిలయ దేశము 1600 చ.మైళ్ళు, 2. సమరయ దేశము 1600 చ.మైళ్ళు, 3. యూదయ దేశము 2000 చ.మైళ్ళు ఉండి మొత్తం 5,200 చ.మై. విస్తీర్ణం కలిగి ఉండెను. ఇశ్రాయేలు దేశములో ప్రాముఖ్యమైన యొర్దాను నది కలదు. ఇశ్రాయేలు దేశమునకు ఉత్తరమున 9,500 అడుగుల ఎత్తుగల హెర్మోను,

లెబానోను అను రెండు సమాంతరకొండలు కలవు. ఆ రెండు కొండలు ఒక్కొక్కటి 20 మైళ్ళ పొడవు, 5 మైళ్ళ వెడల్పు గలవి. ఆ రెండు కొండల మధ్య లోయ ఉన్నది. హెర్మోను కొండ నుండి యెరూషలేము సుమారు 120 మైళ్ళ దూరములో సముద్రమట్టముకు సుమారు 2,500 అడుగుల ఎత్తులో ఉన్నది. కీర్తనలు 133:3లో హెర్మోను మంచు సీయోను కొండల మీదికి దిగివచ్చును అని బైబిల్‌లో వ్రాయబడినట్టు హెర్మోను, లెబానోను కొండలు నిత్యము మంచుతో కప్పబడి ఉండగా ఆ మంచు కరిగి ఆ రెండు కొండల మధ్య ఉన్న లోయలోనికి కారిన నీరు నదిగా 40 మైళ్ళ క్రింద ఉన్న గలిలయ సముద్రమునకు, అక్కడ నుండి 80 మైళ్ళు క్రిందగా ఉన్న మృత సముద్రమునకు ప్రవహించుచున్నది. ప్రస్తుత కాలములో గలిలయ సముద్రమునకు చేరు నీరు ఒక్కటే దేశమంతటికి నీటిని సరఫరాచేయు నదియై ఉన్నది. గలిలయ సముద్రము 15 మైళ్ళ పొడవు 7 మైళ్ళ వెడల్పు 200 అడుగుల లోతు కలిగి సముద్ర మట్టమునకు 690 అడుగుల దిగువ ఉన్నది.

ఇశ్రాయేలు దేశములో వర్షము చాలా తక్కువ. గలిలయ సముద్రపు నీరు మాత్రమే, వ్యవసాయముతో పాటు అన్ని పనులకు వాడుకోవాలి. వీలైన స్థలములలో 2,700 అడుగుల లోతు వరకు భూమిలో రంధ్రములను వేసి బోర్‌వెల్ పంపుల ద్వారా నీటిని తోడి వాడుకొందురు. నీటి కొరతను బట్టి రంధ్రములు కలిగిన రబ్బరు పైపులతో నీటిని సరఫరా చేసికొని మొక్కలకు మాత్రమే అవసరమైన చోట నీటిని వాడుకొందురు. ఈ సేద్య పద్ధతిని బిందు సేద్యమని పిలుచుచున్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా పంటలను, కూరగాయలను, ఫలములను పండించుదురు. కాయలు, ఫలములు ఎంతో పెద్దవిగా నుండును. వంకాయ, టమోటలు ఒక్కొక్క రెండుకిలోల బరువు ఉండును. ద్రాక్షా, అంజూర, ఇతర ఫలములు ఎంతో పెద్ద సైజులో నుండి రుచి గలవిగా నుండును. ఖర్జూరములు ఎంతో మెత్తగాను, విలువైన పోషక పదార్థములు గలిగియుండును. ఏడు ఖర్జూరములో ఒక పూట భోజనమునకు

సరిపోవు పోషక పధార్ధములుండును. ద్వితీయోపదేశ కాండము 8:8లో అది ద్రాక్షా చెట్లు, అంజూరపు చెట్లు, దానిమ్మ పండ్లను గల దేశమని వ్రాయబడినది.

ఇశ్రాయేలు దేశంలో ప్రస్తుతం 70 లక్షల జనాభా ఉంది. ఇందులో 56 లక్షలు (80%) యూదులు, 12.5 లక్షలు (18%) మహమ్మదీయులు 1.4 లక్షలు (2%) క్రైస్తవులు కలరు. యేసుక్రీస్తు దినములలో షుమారు 4 లక్షల జనాభా ఇశ్రాయేలు దేశములోను, 40 వేల జనాభా యెరూషలేములోను నివసించినట్టు అంచనా వేయబడినది. తదుపరి శ్రమల వలన యూదులు చెదరిపోయి క్రీ.శ 1839 నాటికి 11 వేల యూదులు మాత్రమే యెరూషలేములో ఉండిరి. క్రీ.శ. 1897లో ప్రపంచములోని యూదులందరు జయానిష్టుల సంస్థగా ఏర్పడి ఇశ్రాయేలుకు తిరిగి వచ్చుటనారంభించగా క్రీ.శ 1917కు యెరూషలేము జనాభా ఒక లక్షకు చేరినది. క్రమేపి ఇశ్రాయేలు దేశ జనాభా 70 లక్షలకు, యెరూషలేము జనాభా 7 లక్షలకు నేటికి పెరిగినది.

ప్రస్తుతం ఈ దేశంలో 6000 యూదుల సమాజ మందిరములు కలవు. 600 మసీదులు కలవు. 500 చర్చీలు కలవు. ఈ చర్చీలలో కొన్ని పుణ్య స్థలములుగా ఎంచబడిన చారిత్రాత్మక స్థలములలో కట్టబడినవి. ఈ దేశ భూభాగంలో షుమారు సగభాగము నెగేబు అనబడిన ఎడారి ప్రాంతంగా ఉన్నది. 70 లక్షల జనాభా గల ఈ దేశంలో షుమారు 30 లక్షల ఇండ్లు ఉన్నవి. ఈ దేశంలో 40 లక్షల కార్లు కలవు. అనగా ప్రతి ఇంటికి 1 కారు, ప్రతి రెండవ ఇంటిలో 2 కార్లు ఉండును. కీర్తనలు 125:2 వచనములలో యెరూషలేము చుట్టు పర్వతములు ఉన్నవి అని చెప్పబడినట్లు ఆ దేశమంతయు కొండలు, గుట్టలు, లోయలతో నిండియున్నది. అందువలన క్రీ.శ 2000 సం॥ వరకు ఆ దేశములో రైలు మార్గం వేయబడలేదు. 2001 నుండి సముద్రపు తీర ప్రాంతమును కలుపుచూ రైలుమార్గము వేయబడుచున్నది. యాత్రికుల ప్రయాణం

కొరకు బస్సుల సౌకర్యం కలదు. ఈ దేశములో ముఖ్యమైన మూడు పట్టణాలు ఉన్నవి.

1. **టెలవివ్ :** బైబిలు గ్రంథమందు చెప్పబడిన యొప్పే పట్టణము, సముద్ర తీరమున ఉండి ఓడరేవు కలిగియున్నది. ఆ గ్రామము యొక్క ఓడరేవు ప్రాంతమంతయు బ్రహ్మాండమైన టెలవివ్ పట్టణముగా ఈ దినములలో కట్టబడి 8 లక్షల జనాభా, అంతర్జాతీయ విమానాశ్రయం కలిగి, వ్యాపార కేంద్రమై, ప్రస్తుత దేశ రాజధానిగా ఉన్నది.

2. **యెరూషలేము :** 7 లక్షల జనాభా కలిగి రాజకీయంగాను, మతపరం గాను ముఖ్యపట్టణమై యూదావారిని క్రీస్తుకు పూర్వము పరిపాలించిన యూదా రాజులందరు నివసించిన పట్టణము.

3. **హైఫా :** ఏలీయా నివసించిన కర్మెలు కొండపై సముద్రమును ఆనుకొని కట్టబడిన పట్టణము. సముద్రము ఇక్కడ **'U'** ఆకారంలో ఉన్నందున ఓడలకు స్వభావికమైన రేవుగా ఉన్నది. అందువలన వ్యాపారపు కేంద్రమై, షుమారు 3 లక్షల జనాభా కలిగి దేశములో ఉన్న పట్టణములలో 3వ స్థానములో నున్నది. ఇశ్రాయేలు దేశం ఆసియా, ఐరోపా, ఆఫ్రికా ఖండములు కలియు ప్రాంతమున వున్నది. యూదులు ఎక్కువ తెలివి కలిగినవారు. ప్రపంచములో సుమారు సగభాగాన్ని కమ్యూనిజంచే ఆకర్షించ గలిగిన కార్లమార్క్స్‌గారు ఈ దేశ సంతతికి చెందిన యూదుడు. ఈ కమ్యూనిష్టులు నాస్తికులు కాగా ప్రపంచంలోని మిగిలిన సగభాగంలో ఎక్కువమంది ఇంచుమించుగా 1. క్రైస్తవ మతమునకు (33%), 2. మహమ్మదీయ మతమునకు (17%) చెందినవారు. అందువలన ఈ దేశం అతి చిన్నదైనను ప్రపంచమంతటిలో ప్రాముఖ్యతను కలిగియున్నది. క్రీ.పూ. 2000 సం॥లలో ఈ దేశమునందు నివసించిన అబ్రాహాము కాలమునకు

చెందిన షాలేము రాజైన మెల్కీసెదెకు ఆదికాండము 14:18లో మొదటగా మనకు పరిచయస్తుడు. తదుపరి ఈ దేశములో నివసించిన అన్యులైన కనానీయుల రాజులను వెళ్ళగొట్టి యెహోషువ గ్రంథము 12వ అధ్యాయములో వ్రాయబడినట్లు దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి రప్పించి ఈ దేశమును అప్పగించాడు. అప్పటి నుండి నేటివరకు షుమారు 30 దేశములవారు ఇశ్రాయేలును తమ ఆధీనములో ఉంచుకొని పరిపాలించిరి. 40 పర్యాయములు జరిగిన యుద్ధముల కారణంగా ఇశ్రాయే దేశము, యెరూష లేము పట్టణములు ఎంతో దెబ్బతినినవి.

**4. బెత్లేహేము పట్టణం :** యేసు జన్మించిన బేత్లెహేము పట్టణము యెరూష లేము నుండి 6 మైళ్ళ దూరమున నుండి ప్రస్తుతము పాలస్తీనా ప్రభుత్వ ఆధీనములో ఉన్నది. యేసు ప్రభువు జన్మించిన స్థలంలో ఒక దేవాలయం కట్టబడి ఉన్నది. జరోము అను భక్తుడు 4వ శతాబ్దంలో అదే స్థలంలో నివసించుచూ బైబిలు గ్రంథమును గ్రీకు భాషలో నుండి లాటిన్ భాషకు తర్జుమా చేసెను. బెత్లేహేము పట్టణము సమీపంలోనున్న పొలములలో ఉన్న గొర్రెల కాపరులకు దేవుని దూత లూకా 2:9లో ప్రత్యక్షమై క్రీస్తు పుట్టుకను గూర్చి తెలిపిన స్థలములో ఒక దేవాలయము కట్టబడి ఉన్నది. క్రీస్తు పుట్టిన స్థలంలో కట్టబడిన దేవాలయపు ద్వారము అతి చిన్నదిగా ఉంది. క్రీస్తు తన్నుతాను తగ్గించుకొని ఈ లోకానికి వచ్చిన దీనత్వమును సూచిస్తుంది. ఈ దేవాలయములో తూర్పుదేశపు జ్ఞానులు వచ్చిన పటము ఉంచబడినది. వారి రూపములు పర్షియా ప్రాంతము వారి రూపమువలే ఉన్నందున మిగిలిన అన్ని దేవాలయములను తాము పరిపాలించిన కాలములో పడగొట్టిన మహమ్మదీయులు దీనిని కూలగొట్టలేదు. ప్రస్తుతం ఈ పట్టణ జనాభా 25000. ఇందులో క్రైస్తవులు

8000 మంది కలరు. ఈ పట్టణమంతయూ ఇప్పుడు పేదరికము చేత నిండియున్నది. ఆది. 35:10లోనున్నట్లు యాకోబు తన భార్యయైన రాహేలును పాతిపెట్టిన సమాధి నేటికిని కలదు.

**5. బేతనియ :** బేతనియ పట్టణము ఒలీవల కొండ తూర్పు వైపునకు దిగి వెళ్ళు మార్గమున కలదు. యెరూషలేము పట్టణమునకు రెండు మైళ్ళ దూరమున కలదు. ఈ పట్టణమందు కుష్ఠరోగియైన సీమోను ఇంటిలో యేసు భోజనమునకు కూర్చుండుట, ఒక స్త్రీ అత్తరు ఆయన తలపై పోయుట మత్తయి 26:6లో చూతుము. బేతనియాలో యేసును తరచుగా చేర్చుకొను మార్త, మరియ, లాజరుల యిల్లు కలదు. చనిపోయి నాలుగు దినములు సమాధిలో నున్న లాజరును యేసు లేపాడు. లాజరు సమాధి నేటికిని కలదు.

**6. యెరికో పట్టణం :** యెరికో పట్టణము యెరూషలేము నుండి 21 మైళ్ళ దూరములో ఉన్నది. సముద్రము పట్టణమునకు షుమారు 1000 అడుగుల దిగువున ఉన్నది. యెరూషలేము సముద్ర మట్టమునకు 2500 అడుగుల ఎత్తున ఉన్నది. యెరూషలేము నుండి యెరికో 3500 అడుగుల దిగువ ఉన్నందున యెరూషలేము నుండి యెరికో పట్టనమునకు దిగి వెళ్ళుట లూకా 10:30లో వ్రాయబడిన సంగతిని అర్థము చేసుకోగలము. ఈ పట్టణములోని గ్రుడ్డివానిని బాగు చేయుట, జక్కయను రక్షించుట లూకా 18,19 అధ్యాయములలో కలదు. ప్రస్తుతం యెరికో పట్టణము పాలస్తీనా ప్రభుత్వ అధీనములో ఉన్నది. యెరూషలేము నుండి యెరికోకు దిగి వెళ్ళుట ఆత్మీయ పతనమును సూచించును.

**7. యొప్పే పట్టణం :** యొప్పే పట్టణము ఇప్పుడు టెలవివ్ అని పిలువబడు పట్టణము. యెరూషలేమునకు పడమర వైపు 38 మైళ్ళ దూరమున మధ్యధరా

సముద్రము ఒడ్డున ఉన్నది. ఇది సముద్రపు ఓడరేవు. ఈ యొప్పే పట్టణం పాత నిబంధనలో యోనాగ్రంథం 1:3లో చెప్పబడినట్లు అప్పటి నుండి ఓడరేవు. అ.కా. 9:36లో తబితా అను శిష్యురాలును పేతురు ఇక్కడ బ్రతికించెను. ఈ యొప్పే పట్టణములో సీమోను అను చర్మకారుని ఇంట పేతురు ఉండగా సకల జంతువులను గూర్చిన దర్శనము చూచెను. అన్య జనులకు రక్షణ ఉన్నదని యొప్పేలో ఉండగా పేతురుకు తెలుపబడెను. యొప్పే నుండి పేతురు కైసరయకు వెళ్ళి అన్యుడైన కొర్నేలును రక్షణలోనికి నడిపించెను. యొప్పే ఓడరేవు ప్రాంతమున క్రీ.శ. 1909 నుండి కట్టబడిన పెద్ద పట్టణము నేడు 8 లక్షల జనాభా కలిగి 'టెలవివ్' అని పిలువబడుచున్నది. ఇశ్రాయేలులోని బెన్‌గురియన్ అను ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విమానాశ్రయం ఇక్కడనే కలదు.

8. **కైసరయ** : సమరయ దేశములోనున్న సముద్ర తీరమున యొప్పే నుండి 32 మైళ్ళ దూరమున, యెరూషలేమునకు 64మైళ్ళ దూరములో కైసరయ కలదు. క్రీ.పూ. 20 సం॥లు హేరోదు రాజుచే కట్టబడి ముఖ్యమైన ఓడరేవుగా వుండెను. సుమారు 600 సంత్సరములు కైసరయలో రోమా ప్రభుత్వ అధి కారులు ఉండిరి. యూదయ దేశపు అధికారియగు ఫేలిక్సు ఈ పట్టణములో ఉండి పాలించెను. రోమా సైన్యమునకు శతాధిపతియగు కొర్నేలీ అ.కా. 10,11 అధ్యాయాలలో చెప్పబడిన రీతిగా ఈ పట్టణములో ఉన్నప్పుడు పేతురు వచ్చి సువార్త ప్రకటించగా రక్షించబడెను. అపొస్థలులు – అన్యజనులకు దేవుడు రక్షణార్థమైన మారుమనస్సు దయచేయునని గ్రహించిరి. పరిచారకుడగు ఫిలిప్పు కైసరయలో ఉండి సేవచేసినట్లు అ.కా. 8:40లోను 21:8లోను చూడగలము. పౌలు అ.కా. 21 అధ్యాయములో అరెస్టు చేయబడి కైసరయలోని కావలిలో వుంచబడెను. యూదా అధికారియగు ఫేస్తుచే అ.కా. 25-26 అధ్యాయాలలో విచారించబడి కైసరయలో ఓడ ఎక్కి రోముకు వెళ్ళెను.

**9. గలిలయలోని నజరేతు :** యెరూషలేమునకు ఉత్తర దిక్కున 88 మైళ్ళ దూరముననున్నది. యోహాను 1:46లో నజరేతులో నుండి మంచిదేదైనా రాగలదా? అని వున్నది. ఒకప్పటి చిన్న గ్రామమైన నజరేతులో వడ్రంగి పనివాడైన యోసేపు ప్రధానం చేయబడిన తన భార్యతో నివసించువాడు. యోసేపు మరియల సొంతవూరు బేత్లెహేము. కాని హేరోదు రాజు నజరేతు సమీపమున 'సిప్పోరి' అను పట్టణమును కట్టించుచున్నందున వడ్రంగి పనితో జీవనము చేయు యోసేపు అక్కడికి వెళ్ళెను. యోసేపు మరియ అక్కడ వుండగా గబ్రియేలు దూత పరిశుద్ధాత్మ వలన మరియ గర్భము ధరించిన సంగతి యోసేపుకు తెలిపెను. యేసు జన్మించిన దినాలలో నజరేతు జనాభా 400 మాత్రమే. ఈ గ్రామములో యేసు నివసించిన ఇల్లు మానవ నివాసమునకు యోగ్యమైనది కాదేమో అనిపించును. లూకా 4 అధ్యా. యేసు యెషయా గ్రంథపుచుట్టను తెరచి చదివిన సమాజమందిరము ఈ గ్రామములో కలదు. నేడు ఈ పట్టణములో 70 వేలు జనాభా ఉంది. అందరూ అరబ్బులే. యూదులు లేరు. సగము మహమ్మదీయులు సగము అరబు క్రైస్తవులు. ఇశ్రాయేలు దేశమంతటిలో ఎక్కువమంది క్రైస్తవులు కలిగిన పట్టణంగా పేరు పొందినది. నజరేతులో నుండి మంచిదేదైనారాగలదా? అన్న ప్రశ్నకు నజరేతులో నివసించిన యేసు మంచివారు. నేడు ఆ పట్టణము అనేకమంది అరబ్బు క్రైస్తవులు నివసించు పట్టణంగా ఉన్నది.

**10. తాబోరు కొండ :** నజరేతు పట్టణమునకు తూర్పుగా నాలుగుమైళ్ళ దూరమున ఈ కొండ కలదు. ఇది సముద్ర మట్టమునకు 1850 అడుగుల ఎత్తున గలదు. గలిలయ సముద్రము సముద్ర మట్టమునకు 690 అడుగుల దిగువన ఉన్నందున తాబోరు కొండ మిగుల ఎత్తయినదిగా నున్నది. యేసు-పేతురు, యోహాను, యాకోబులను వెంట బెట్టుకొని రూపాంతరము పొందిన కొండ ఇదియే.

11. గలిలయలోని కపెర్నహూము : యెరూషలేమునకు ఉత్తరదిక్కున 94 మైళ్ళదూరములోనున్నది. యేసు పుట్టినది యూదా దేశములోని బేత్లెహేములో. ముప్పది ఏండ్ల వయస్సు వరకు పెరిగినది గలిలయ దేశములోని నజరేతులో.

కపెర్నహూము పట్టణము గలిలయ సముద్రతీరము నుండి ప్రభువైన యేసు మూడున్నర సంవత్సరములు సేవచేసిన దినములలో నివసించిన పట్టణముగా ఉన్నది. అందుచేత మత్తయి 9:1లో ఈ పట్టణము తన పట్టణము అని పిలువబడింది. ఈ పట్టణములోనే యేసు, పేతురు ఇంటిలో ప్రవేశించెనని మత్తయి 8:14లో చూడగలము. ఈ ఇంటిలోనే పేతురు అత్తను స్వస్థ పరచెను. ఈ ఇల్లు కూడా సామాన్యమైనదిగా ఉన్నది. ఈ చిన్న ఇంటిలో పేతురు తన భార్య, అంద్రెయ, వారి అత్త నివసించుట ఎంత ఆశ్చర్యముగా నున్నది. కపెర్న హూములోనే శతాధిపతి దాసుని స్వస్థపరచిన సంగతి మత్తయి 8:5-13లో వున్నది. యేసు ఈ పట్టణములోనే సుంకపు మెట్టుయొద్ద కూర్చుండి, సుంకము వసూలు పనిచేయు మత్తయిని శిష్యునిగా పిలిచెనని మత్తయి 9:9లో చూడగలము. యేసు ఈ పట్టణంలోనే సమాజమందిరపు అధికారియగు యాయీరు కుమార్తెను స్వస్థపరచెనని మార్కు 5:35-42లో చూడగలము. 12 ఏండ్ల రక్త స్రావరోగము కలిగిన స్త్రీని స్వస్థపరచినది కూడా ఈ గ్రామంలోనే. ఈ గ్రామంలో నుండియే ఆయన ఓడయెక్కి గలిలయ సముద్రము దాటి గెరాసేనుల దేశము లేదా గదరేనియుల దేశమునకు వచ్చి సమాధులలో నివసించు దయ్యము పట్టిన వ్యక్తిని బాగు చేసెను. ఈ గెరాస లేదా గదర గ్రామము గ్రీకు వారిచే కట్టబడిన పట్టణమై దయ్యముల నివాస స్థలమైవుండెను. తదుపరి ఈ గెరాసను రోమీయులు దెకపోలి ప్రాంతములో కలిపివేసిరి.

**12.** గలిలయలోని కానా : ఈ పట్టణము యెరూషలేమునకు 90 మైళ్ళ దూరములో ఉన్నది. యేసు గలిలయలోని కానా వివాహమునకు వెళ్ళి శుద్ధీకర ణాచారపు ఆచరణలోని ఆరు బానల నీళ్ళను ద్రాక్షరసంగా మార్చెను. ఈ స్థలంలో ఆరు బానలు కలిగిన ఒక దేవాలయము కట్టబడినది. దీనికి అనుబంధముగా వున్న ఒక షాపులో వచ్చిన యాత్రీకులందరికి ఒక గ్లాసు ద్రాక్షరసం నేటికిని ఉచితముగా ఇవ్వబడుతున్నది. యోహాను సువార్త 21:2లో నున్నట్లు శిష్యుడైన నతనియేలు ఈ ఊరివాడు. యోహాను సువార్త 2వ అధ్యాయములోని వివాహము నతనియేలుదని తలంచబడుచున్నది.

**13. యేసు ప్రసంగించిన ధన్యతల కొండ :** గలిలయ సముద్రమునకు ఆవలి వైపు ఈ కొండ కలదు. మత్తయి 5-8 అధ్యాయాలలో చెప్పబడిన కొండ మీద ప్రసంగము బోధించిన కొండను ధన్యతలకొండ అంటారు. ఈ స్థలంలో ఒక దేవాలయం కట్టబడి 8 పక్షములలో 8 ధన్యతలు వ్రాయబడినవి. ఈ ప్రాంతములోనే మరియొక కొండపై యేసు ప్రభువు 5 రొట్టెలు 2 చేపలు ఆశీర్వదించి 5 వేల మందికి పంచిపెట్టగా 12 గంపలు శిష్యులు ఎత్తినట్లు మత్తయి 14:15-21 వచనాలలో వ్రాయబడియున్నది. గలిలయ సముద్రమునకు మరొక వైపున వున్న కొండపై యేసు ప్రసంగించిన పిమ్మట వారిని స్వస్థ పరిచెను. 7 రొట్టెలు కొన్ని చిన్న చేపలను ఆశీర్వదించి వారికివ్వగా 4 వేలమంది తినిన పిమ్మట, 7 గంపలకు ఎత్తిరి. వీరు ఇశ్రాయేలు దేవుని మహిమ పరిచిరి అని మత్తయి 15:31లో వ్రాయబడినది. అలాగైన వీరు ఇశ్రాయేలీయులు కారని, అన్యులు అని తలంచగలము. ముందుగా భోజనము పెట్టినప్పుడు మిగిలిన 12 గంపలు ఇశ్రాయేలులోని 12 గోత్రాల వారికి ఇచ్చెనని తలంచ గలము. మరియు 2వసారి ఎత్తిన 7 గంపలు కనాను నుండి దేవుడు వెళ్ళగొట్టిన 7 జాతుల వారికి అనగా అన్యులకు ఇచ్చెను అని తలంచగలము.

పాపము చేసిన యూదావారిని రాజైన నెబుకద్నెజరు కాలమున యెరూషలేము నుండి బయటికి పంపించాడు. దానికంటే ముందుగా అమ్మోరీయుల అక్రమము సంపూర్ణమైనప్పుడు 7 జాతుల కనానీయులను ఆ దేశము నుండి బయటికి వెళ్ళగొట్టాడు. కాని 12 రొట్టెల గంపలు 12 గోత్రాల ఇశ్రాయేలు వారికి, 7 గంపలు 7 జాతుల కనానీయులకు ఇచ్చినందున దేవుడు ఇశ్రాయేలు వారినైనను అన్యులనైనను పాపముచేసిన యెడల పాపమును బట్టివారిని శిక్షించునని నేర్చుకొనుచున్నాము కాని దేవుడు తన ప్రేమను కనుపరచు నప్పుడు యూదులకు, అన్యులకు సమానముగా కనుపరచునని నేర్చుకొనుచున్నాము. ఎఫెసీ. 2:11-14 ప్రకారము ఇశ్రాయేలీయులను అన్యులను క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులుగా చేసి ఉభయులను ఏకముగా చేసెను.

**14. బేత్సయిదా :** యోర్దాను నది గలిలయ సముద్రపు పై భాగములో కలియు ప్రాంతమునకు తూర్పుగానున్నది. ఇది శిష్యులైన ఫిలిప్పు, పేతురు, అంద్రెయల పట్టణమని యోహాను 1:44లోనున్నది. బేత్సయిదా అనగా చేపలు పట్టు వారి ఇల్లు అని అర్థము. అందువలన బేత్సయిదాలు రెండు యోర్దాను నదికి తూర్పున ఒకటి, పడమట ఒకటి కలవని తలంచుదురు.

**15. గలిలయ సముద్రం :** గలిలయ సముద్రం, తిబెరయ సముద్రమని, కిన్నెరేతు సముద్రమని, కిన్నెరేతు సరస్సు అని పిలువబడుచున్నది. గలిలయ అనగా గుండ్రని అని అర్థము. గుండ్రని ఆకారము దీనికున్నందున గలిలయ సముద్రమని పలుచోట్ల పిలువబడుచున్నది. తిబెరయ, కిన్నెరేతు, గ్రామములు దీని చుట్టున ఉన్నందున తిబెరయ సముద్రమని, కిన్నెరేతు సముద్రమని పిలువబడుచున్నది. కిన్నెరేతు అనగా వీణ అని అర్థము. గలిలయ సముద్రముపై నున్న హూలే సరస్సు మధ్యనున్న యోర్దాను కలిసి వీణె ఆకారముగా నున్నందున అది కిన్నెరేతు సముద్రమని పిలువబడుచున్నది. దీని పొడవు 15 మైళ్ళు, వెడల్పు

7 మైళ్ళు, లోతు 200 అడుగులు. ఇది హెర్మోను కొండ క్రింద 40 మైళ్ళ దూరమునందు సముద్ర మట్టమునకు 690 అడుగులు క్రింద వున్నది. యేసు ప్రభువు శిష్యులైన సీమోనును, అంద్రెయను, యాకోబును, యోహానును "నా వెంబడి రండి" అని పిలిచినది ఇక్కడనే. యేసు శిష్యులతో కూడా తరచుగా దోనెలలో ప్రయాణము చేయువాడు. తుఫాను ఎదురై, దోనె నీళ్ళతో నిండినప్పుడు గాలిని తుఫానును, ఈ సముద్రములోనే గద్దించాడు. యేసు, యేసుతోపాటు పేతురు నీళ్ళపై ఈ సముద్రంలోనే నడిచారు. సీమోను పేతురు రాత్రంతా ప్రయాసపడితిమి, మాకేమి దొరుకలేదని లూకా 5:5లో ఈ సముద్రము గట్టున పలికెను. యేసు ప్రభువు పునరుత్థానుడైన పిమ్మట పేతురు 6 మంది శిష్యులతో కలసి యోహాను 21వ అధ్యాయంలో చేపలు పట్టడానికి ఈ సముద్రములోనికి వెళ్ళెను. హెర్మోను కొండ నుండి మంచుకరిగి ప్రవహించి ఈ సముద్రమునకు వచ్చును గనుక ఈ నీరు మంచిదై వున్నది.

**16. యోర్దాను నది :** గలిలయ సముద్రము నుండి 80 మైళ్ళ క్రిందనున్న మృత సముద్రము వరకు యోర్దాను నది వంకరలు కలిగి ప్రవహించును గనుక నది పొడవు 200 మైళ్ళుగానుండును. బాప్తీస్మమిచ్చు యోహాను ఈ నదిలో అందరికి బాప్తీస్మమిచ్చువాడు. మృత సముద్రమునకు కొంచెము పైగా యెరికోకు సమీపమున యోహాను ద్వారా యేసు బాప్తీస్మము పొందాడు. తదుపరి సమీపముననున్న అరణ్య ప్రాంతానికి సాతాను చేత శోధించబడుటకు కొనిపో బడెను. యెరూషలేమునందలి దేవాలయ శిఖరమునకును కొనిపోబడెను. మత్తయి 4:1-10 వచనాలలో వ్రాయబడినట్లు రాళ్ళను రొట్టెలుగా చేయుము అని అపవాది అన్నాడు. ఆ ప్రాంతమంతటిలో ఎత్తైన కొండలు యెరూషలేము పట్టణమునకు సంబంధించినవియే. అవన్ని రొట్టెలయితే క్రీస్తు శరీరమందు పాట్లుపడు అవకాశమే ఉండదు. ఇటువంటి అనేక తలంపుల ద్వారా సాతాను దేవుని కార్యములను భంగపరచ తలంచాడు.

# యెరూషలేము పట్టణము

## వివరములు ప్రస్తుత ప్రాకారము

## పసుపు పచ్చరంగున్నది నెహెమ్యా కాల ప్రాకారము

'O' ఓలీవల కొండ - గెత్సేమనే - క్రీస్తు ఆరోహణమైన కొండ

'M' మోరియాకొండ - దేవాలయపు కొండ

'$Z_1Z_2Z_3$' సీయోను మూడు కొండలు

'T' కల్వరి కొండ - యేసు సిలువవేయబడిన కొండ

'D' దావీదుపురము అను కొండ

### పట్టణ ప్రాకార ద్వారములు

a) హేరోదు గుమ్మము b) దమస్కు గుమ్మము

c) క్రొత్త గుమ్మము d) జాఫా గుమ్మము

e) సీయోను గుమ్మము f) పెంట గుమ్మము

g) బంగారు గుమ్మము h) సింహపు గుమ్మము

1. మేడగది 2. వేదనపడిన గెత్సెమనే

3. ప్రధాన యాజకుల ఇల్లు 4. పిలాతు అధికార మందిరము

5. హేరోదు అధికార మందిరము 6. సిలువ వేయబడిన కల్వరి కొండ భాగము

7. ఖాళీగానున్న యేసు సమాధి 8. శృంగారమను దేవాలయ ద్వారము

9. సొలొమోను మంటపము 10. బెతెస్థ కోనేరు

11. యూదుల రాజుల సమాధులు 12. సిలోయము అను కోనేరు

13. బేతనియ పట్టణమందు లాజరు సమాధి

$Z_1$ కొండ ప్రస్తుతము యూదుల నివాసము

$Z_2$ కొండ ప్రస్తుతము క్రైస్తవుల నివాసము

4) పిలాతు అధికారమందిర ప్రాంతము ప్రస్తుతము మహమ్మదీయుల నివాసము.

I) తూర్పు పడమరలలోయ II) టెరోపియన్‌లోయ

III) హిన్నోములోయ IV) కిద్రోను లోయ

## ఇశ్రాయేలు దేశము

**17. కొమరాన్ గుహలు :** యెరూషలేముకు 25 మైళ్ళదూరమున మృత సముద్ర సమీపమున, ఈ గుహలు కలవు. ఈ గుహలలో "ఎసెన్స్" అను నిష్ఠగల యూదులు క్రీ.శ. 68 వరకు నివసించిరి. వారు సమూహముగా జీవించుచూ పరిశుద్ధతకు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చువారు. తెగ అంతయు కలసి సామూహికముగా భోజనము చేయువారు. పగలంతయూ పాతనిబంధన గ్రంథములను వ్రాసి చుట్టలుగా చుట్టి మట్టి కుండలలో భద్రపరచువారు. క్రీ.శ. 70లో రోమా వారు యెరూషలేము పై దండెత్తి నాశనము చేసినప్పుడు వీరును చెదరిపోవలసి వచ్చెను. ఆ సమయమున గ్రంథములు గల కుండలను కొండ గుహలలో దాచిరి. క్రీ.శ. 1947లో "బొడోన్" అను సంచారజాతి వారు గొర్రెలను మేపుచూ తప్పిపోయిన గొర్రె కొరకు ఒక గుహలోనికి రాయి విసరగా అది ఒక మట్టికుండకు తగిలిన శబ్దము వినవచ్చెను. ఆ పిల్లలు లోపలికి వెళ్ళి చుట్టబడిన గ్రంథములను కుండలలో కనుగొనిరి. తదుపరి అటువంటి సుమారు 300 గుహలలో వెదకగా పాత నిబంధన గ్రంథములోని ఎస్తేరు మినహా అన్ని పుస్తకములు, అపోక్రిపా పుస్తకములు దొరికెను. అవన్నియు ప్రస్తుతము వాడబడు బైబిల్ గ్రంథములోని పుస్తకములవలె నూటికినూరు పాళ్ళుఉన్నట్లు కనుగొనిరి. అవి హెబ్రీ, అరామియెక్ భాషలలో నున్నవి. ఇవన్నియు బైబిలు గ్రంథ ప్రామాణికతను రుజువు పరచుచున్నవి. ఇశ్రాయేలు పై గతములో క్షిపణులను ప్రయోగించిన సద్దామ్ హుస్సేన్‌గారు ఈ బోడోన్ తెగకు చెందిన వారు. సద్దామ్ యూదులను నాశనము చేయగోరెను. కాని ఆ జాతికి చెందిన వారిని దాచబడిన పరిశుద్ధ గ్రంథమును వెలికి తీయుటలో దేవుడు వాడుకొనెను.

**18. మృత సముద్రము :** మృత సముద్రం 50 మైళ్ళ పొడవు 10 మైళ్ళ వెడల్పు కలిగి దాని నీటి మట్టము సముద్ర మట్టమునకు 1300 అడుగులు (400 మీ.) దిగువన ఉన్నది. మృత సముద్రము యొక్క లోతు మోయాబు కొండల ప్రాంతమున 1300 అడుగులు (400 మీ.) అనగా సముద్ర మట్టమునకు 2600 అడుగుల లోతు. భూమి అంతటిలో మృత సముద్రము యొక్క మట్టము

అతి తక్కువలో ఉన్నది. మృత సముద్రమునకు వచ్చు నీటి కంటె ఆవిరియగు నీరు ఎక్కువైనందున ప్రతి సంవత్సరము నీటి మట్టము తగ్గుచున్నది. గలిలయ సముద్రము నుండి మృత సముద్రము వరకు నిటారుగా ఉన్న దూరం 80 మైళ్ళు అయినను యొర్దాను నది ఎక్కువ వంకరలు కలిగి ప్రయాణించు చున్నందున దాని పొడవు 200 మైళ్ళుగా ఉండును. గలిలయ సముద్రము నీరు మంచిది. మృత సముద్రపు నీటిలో ఎక్కువగా ఉప్పు ఇతర లవణములు కలవు. సర్వ సాధారణముగా సముద్రపు నీటిలో 3 శాతం ఉప్పు, 2 శాతం లవణములు ఉండును. కాని మృత సముద్రంలో 25 శాతం ఉప్పు 10 నుండి 15 శాతము లవణములు కలవు. అందుచేత నీటి సాంద్రత చాలా ఎక్కువ. మనుషులు సైతము ఆ నీటిపై పండుకున్నప్పుడు మునగక తేలుదురు. ఆదికాండము 19:24వ వచనంలో వ్రాయబడినట్లు ఆకాశము నుండి అగ్ని గంధకములు కురిసి కాలిపోయిన సొదొమ గొమొఱ్ఱా పట్టణములు మృత సముద్రములో కలసి పోయినవి. అందుచేత అప్పటి గంధకము కూడా ఈ నీటిలోనున్నది. 4500 టన్నుల బరువైన లవణములు ఈ నీటిలో కలవని అంచనా వేయబడినది. అందువలన మృత సముద్రములో ఏమియు బ్రతకవు. హెర్మోను కొండ మంచు కరగగా వచ్చు పరిశుద్ధమైన నీరు యొర్దానునది గుండా క్రిందికి దిగి వచ్చి మృత సముద్రములో కలిసినట్లు ఆత్మీయ జీవితములో దిగజారిన వారు జీవించుచున్నారని పేరు కలిగినను మృతులేనను సత్యమును నేర్చుకొనగలము.

# యెరూషలేము పట్టణం

ఆ.కా. 14:18లో షాలేము అని పిలువబడిన ఆ పట్టణప్రాంతము ఆ.కా. 22:14లో యెహోవా యీరే అని పిలువబడినందున యీరే, షాలేము కలిసి పోయి యెరూషలేముగా పిలువబడినది. క్రీ.పూ. 1400 వరకు కనానీయుల 7 జాతులవారు అక్కడ నివసించిరి. క్రీ.పూ. 2000 సం॥లో కల్దీయుల దేశం లోని ఊరు అను పట్టణము నుండి అబ్రాహాము బయలుదేరి కనానుదేశము నకు వచ్చినను దేవుడు అబ్రాహాము తరువాత 4వ తరము వారికి ఆ దేశమును యెహోషువ దినములలో ఇచ్చాడు. యెరూషలేము పట్టణము బెన్యామీను గోత్రమునకు స్వాస్థ్యముగా ఇయ్యబడిన భాగంలో ఉన్నను, యూదా బెన్యామీను స్వాస్థ్యపు సరిహద్దుకు సమీపంలో ఉన్నది. యెరూషలేము సముద్ర మట్టమునకు 2,500 అడుగుల ఎత్తున ఉన్నది.

యేసు ప్రభువుకు తల్లియగు మరియకు, మూలపురుషుడుగా ఎంచ బడిన రాజైన దావీదు కాలమున యెరూషలేము పట్టణములో చివరిదిగా యెబూసీయుల నుండి వశపరచుకొనబడిన దావీదుపురము అనబడిన సీయోను కోట (2వ సమూ. 5:7లో) ప్రాంతముతో కలిపి యెరూషలేము సంపూర్ణమైన పట్టణముగాను నాటి నుండి రాజుల యొక్క ముఖ్య పట్టణంగా కొనసాగింది. రాజైన దావీదు పట్టణములను కట్టించగా, సొలొమోను పట్టణం లోని కట్టడములు కట్టించెనని చెప్పబడుచున్నది. యెరూషలేములోని మోరియా కొండపై షుమారు క్రీ.పూ. 2000 సం॥నందు అబ్రాహాము, తన కుమారుడైన ఇస్సాకును బలిగా అర్పించాడు. ఇదే కొండపై రాజైన దావీదునకు ఒర్నాను కళ్ళమున్న స్థలమున యెహోవా క్రీ.పూ. 970కి కొంచెము ముందు ప్రత్యక్షం కాగా దేవుని సెలవుతో దావీదు ఆ స్థలముసుకొని మందిర నిర్మాణముకై ప్రత్యేకించాడు.

వివరములు 2 సమూ. 24 అధ్యాయములో కలవు. క్రీ.పూ. 967 నుండి 960 సం॥ వరకు ఈ స్థలములోనే రాజైన సొలొమోను మందిరమును కట్టాడు. ఈ మందిరము రాళ్ళతోను, మ్రానులతోను కట్టబడి బంగారముతో పొదిగించబడినది. ఈ బంగారమునకు పెట్టించబడిన మెరుగు 50 మైళ్ళ దూరము కనిపించెడిది. యెరూషలేము షుమారు 40 పర్యాయములు శత్రువులచే పట్టుబడి పడగొట్టబడి నాశనమైంది. తీతు చక్రవర్తి క్రీ.శ. 68లో నాశనము చేసిన పిదప 60 యేండ్లు నిర్మానుష్యముగానుండెను. అందువలన క్రీస్తు నివసించిన నాటి కాల పట్టణము చాలా వరకు చెత్తచేత పూడ్చబడి నేటి పట్టణమునకు సుమారు 40 అడుగుల క్రింద ఉండును. కావున అప్పటి భౌగోళిక రూపమునకు, నేటి భౌగోళిక రూపమునకు తేడా కనిపించును.

యూదులు విగ్రహారాధికులై పాపము చేసినందున క్రీ.పూ. 586లో కల్దీయుల రాజగు నెబుకద్నెజరు ద్వారా ఈ మందిరము పడగొట్టబడి కాల్చ బడింది. తదుపరి క్రీ.పూ. 536 నుండి 515 వరకు జెరుబ్బాబేలు, యెహోషువాల ద్వారా కట్టబడినది. నెబుకద్నెజరు పడగొట్టిన పట్టణ ప్రకారము నెహెమ్యా ద్వారా క్రీ.పూ. 444లో కట్టబడినది. ఈ ప్రాకారమునకు 12 గుమ్మములు ఉన్నట్లు నెహెమ్యా గ్రంథము 3వ అధ్యాయంలో చూడగలము. మధ్యపేజీలలో నున్న యెరూషలేము పట్టణ పటమునందు పసుపుపచ్చగా నెహెమ్యా కాలప్రాకారము చూపబడినది.

1. గొర్రెల గుమ్మము, 2. మత్స్యపు గుమ్మము, 3. పాత గుమ్మము, 4. మూలగుమ్మము, 5. బంధీగృహగుమ్మము. 6. లోయగుమ్మము, 7. పెంట గుమ్మము, 8. ధార గుమ్మము, 9. నీటి గుమ్మము, 10. గుర్రపు గుమ్మము, 11. తూర్పు గుమ్మము, 12. మిప్కాదు గుమ్మము,

తదుపరి క్రీ.పూ. 35 సం॥ నుండి హేరోదురాజు దేవాలయ ప్రాంతాలను విస్తరింప చేశాడు. యెరూషలేము పట్టణపు ప్రాకారము అందలి గోపురములను

కట్టించాడు. ఈ పట్టణ ప్రకారమునకు 8 గుమ్మములు కలవు. హేరోదురాజు కట్టించిన ప్రాకారము పటములో నల్లని లైనుగా చూపబడినది.

ఎ) హేరోదు గుమ్మము, బి) దమస్కు గుమ్మము, సి) కొత్త గుమ్మము, డి) జాఫాగుమ్మము, ఇ) సీయోను గుమ్మము, ఎఫ్) పెంట గుమ్మము, జి) బంగారు గుమ్మము, హెచ్) సింహపు గుమ్మము. ఈ బంగారు గుమ్మము గుండా యేసు జీవితపు చివరివారములో యెరూషలేము పట్టణములోనికి ప్రవేశించాడు. (మధ్యపేజీలో పటము చూడుము) ప్రస్తుతము ఈ గుమ్మము లోపల "డోమ్ ఆఫ్ ది రాక్" అను మసీదు ఉన్నందున ఈ గుమ్మము మూయబడినది. ఈ పట్టణ ప్రాకారము మిగిలిన ఏడు గుమ్మములను కలిగి తూర్పు, పడమర, ఉత్తరము, దక్షిణ దిక్కున ఒక్కొక్క కిలోమీటరు పొడవుకలిగి షుమారు నాలుగు కిలో మీటర్ల చుట్టు కొలత గలదిగా నున్నది. సింహపు గుమ్మము దగ్గర అ.కా. 7:59లో వ్రాయబడినట్లు స్తెఫను పట్టణము వెలుపల రాళ్ళచేత కొట్టబడి చనిపోయెను. (మధ్యపేజిలో పటము చూడుము)

2. హేరోదు గుమ్మము గుండా పట్టణములో మహమ్మదీయులు నివసించు ప్రాంతమునకు రాగలము.

3. సీయోను గుమ్మము గుండా యూదులు నివసించు ప్రాంతమునకు రాగలము. సీయోను గుమ్మము వెలుపల బెత్లేహేము, హెబ్రోనులకు వెళ్ళు దారి కలదు.

4. జాఫా గుమ్మముగుండా యొప్పే, టెలవివ్‌కు వెళ్ళుమార్గము కలదు.

5. దమస్కు గుమ్మము గుండా దమస్కు పట్టణమునకు వెళ్ళు మార్గము కలదు.

యేసు ప్రభువు పుట్టినపుడు జనసంఖ్యలు వ్రాయబడినవి. అప్పుడు ప్రపంచ జనాభా 25 కోట్లు. ఇశ్రాయేలు దేశజనాభా నాలుగు లక్షలు యెరూషలేము

పట్టణ జనాభా నలభైవేలు. నేడు యెరూషలేము జనాభా విస్తరించి ఏడు లక్షలుగా నున్నది. పట్టణ సరిహద్దులును విస్తరించినవి. యూదులు ఆరు లక్షల మంది. మహమ్మదీయులు ఒక లక్ష మంది. క్రైస్తవులు పదివేల మంది.

యేసు ప్రభువు తల్లియగు మరియ, తండ్రిగా ఎంచబడిన యోసేపులు బేత్లెహేములో జన్మించారు. ఆ దినములలో రాజైన హేరోదు గలిలయ దేశంలో నజరేతు సమీపమున కట్టడములను కట్టించుచున్నందున వడ్రంగి పనివాడైన యోసేపు తన భార్యయైన మరియతోను, యేసుతోను నజరేతులో నివసించాడు. యేసు 30 ఏండ్ల ప్రాయము వరకు నజరేతులో తల్లి యింట నివసించిననూ సంవత్సరమునకు 3 పర్యాయాలు యెరూషలేము దేవాలయము నకు వచ్చువాడు. సేవ ప్రారంభించిన పిదప అనేక పర్యాయాలు యెరూషలేము నకు వచ్చువాడు. యెరూషలేము పట్టణ ప్రాకారము లోపల భౌగోళికంగా మోరియా పర్వతము కలదు. మోరియా పర్వతపు పడమటి వైపునకు దక్షిణ వైపునకు టెరూపియన్ లోయ కలదు. పడమర వైపు ఉన్న టెరూపియన్ లోయ ప్రక్కలో పెద్ద కొండయగు సీయోను కొండ, దానిపైనున్న మరి రెండు చిన్న కొండలనుండి పట్టణపు వెలుపలకి వచ్చు గుమ్మం సీయోను గుమ్మమని పిలువబడుచున్నది. మోరియా పర్వతమునకు దక్షిణముగా ఉన్న టెరూపియన్ లోయకు దక్షణాన సీయోనుకోట అని పిలువబడు దావీదుపురము కలదు. ఇది కోట కలిగినందున దీనికి తూర్పున కిద్రోను లోయ దక్షణమున హిన్నోము లోయవున్నందున ఇది ఒక కొండవలె ఉన్నది. దావీదుపురంలోనే యూదా రాజులు ఇంచుమించు అందరూ నివసించిరి. సమాధి చేయబడిరి. ఈ ఐదవ పర్వతము దావీదు దినములలో పట్టణపు ప్రాకారము లోపల ఉన్నది. కానీ దావీదు పురము ఇప్పటి ప్రాకారము వెలుపల ఉన్నది. మోరియా పర్వతానికి తూర్పువైపున కిద్రోనువాగు దానికి తూర్పు వైపున ఒలీవలకొండ ఉన్నది. లూకా.

21:37 ప్రకారం యేసు ప్రతి రాత్రి ప్రార్థనలో గడిపిన కొండ ఇది. ఇది దేవాలయము నుండి విశ్రాంతి దినమున నడవదగినంత దూరము (అపో. 1:11) అనగా 1:4 కి.మీ. దూరాన వున్నది. దీనిని యేసు ప్రభువు తిరిగిన 6వ కొండగా లెక్కించవచ్చును.

పట్టణమునకు ఉత్తర దిక్కున దమస్కు గేటునకు 700 అడుగుల సమీపమున కపాలము, గోల్గోతా, కల్వరి అని పిలువబడు కపాలపు ఆకారము గల కొండ గలదు. పట్టణపు గవిని వెలుపల ఈ కొండపై మనిషి పుర్రెవంటి ఆకారము కలిగి యేసు సిలువ వేయబడిన కొండ భాగము వున్నది. దీనిని యేసు ప్రభువుకు సంబంధించిన ఏడవ కొండగా తలంచగలము. ఇందులోనే మరణించిన యేసు పాతి పెట్టబడి ప్రస్తుతం ఖాళీగా ఉన్న అరిమతయి యోసేపు యొక్క సమాధి ఉన్నది. సమాధి ఉన్నచోట దానికి సమీపంగా ఒక ద్రాక్ష తోట ఉన్నది. టైటిల్ చివరి పేజీలో కల్వరి కొండ, యేసు యొక్క సమాధి పటములను చూడండి.

బాప్తీస్మముఇచ్చు యోహాను తల్లియైన ఎలీసబెతు, జకర్యాలు నివసించిన ఇల్లు, ఎలీసబెతు యొక్క తల్లిదండ్రుల ఇల్లు యెరూషలేమునకు సమీపములో ఉన్న కొండ సీమలలో ఉన్న "యన్‌కారం" అనుగ్రామంలో ఉన్నది. ఎలీసబెతు ఆరవ మాసము గర్భిణీగా ఉన్నప్పుడు యేసు తల్లియైన మరియ నజరేతు నుండి యూదా దేశంలోని కొండసీమలో ఉన్న ఎలీసబెతు ఇంటికివచ్చిన గ్రామం ఈ "యన్‌కారమే". లూకా 1:39, 1:56 ప్రకారము మరియ ఈ గ్రామములో మూడుమాసాలు ఉండెను. ప్రస్తుతము యెరూషలేము పట్టణము విస్తరించినందున "యన్ కారము" అని పిలువబడు ఈ ఊరు యెరూషలేముకు పడమటి దిక్కున వుండి పట్టణంలో కలిసిపోయింది.

హేరోదు రాజు భవనము సీయోను కొండ మీద కలదు. ప్రధాన యాజకులైన అన్న, కయపల నివాసము కూడా సీయోను కొండపై సీయోను

గుమ్మము లోపల ఉన్నవి. మోరియా కొండ ఉత్తర పడమట మూలన యాంటోని కోట అని కట్టబడిన కోటలో మహా హేరోదు తదుపరి యెరూషలేమును పాలించిన రోమా గవర్నరగు పిలాతు నివాసస్థలంగా వున్నది. ఇక్కడనే యేసు ప్రభువు పిలాతుచే తీర్పు తీర్చబడెను. (మధ్య పేజీలలో పటము చూపబడినది) దీనికి సమీపంలో తూర్పున యోహాను సువార్త 5:1లోనున్న బేతెస్ద కోనేరు, గొర్రెల గుమ్మము కలదు. యేసు సమాధి చేయబడిన స్థలం వరకు నడిచివెళ్ళిన మార్గమంతటిలో ఈ క్రింద కనబరచిన 14 ప్రాముఖ్య స్థలములలో మందిరాలు నిర్మించబడినవి.

1. యేసుకు మరణశిక్ష విధించిన స్థలం, 2. యేసుపై సిలువ మోపిన స్థలం, 3. సిలువ మోయలేక మొదటిసారి క్రిందపడిన స్థలం, 4. తల్లియైన మరియ క్రీస్తును కలిసిన స్థలం, 5. కురేనీయుడైన సీమోను పై సిలువను మోపిన స్థలం, 6. యేసు ముఖమును విరోనికా తుడిచిన స్థలం, 7. యేసు రెండవసారి క్రిందపడిన స్థలం, 8. యెరూషలేము స్త్రీలు క్రీస్తును కలిసిన స్థలం, 9. యేసు నేలపై క్రిందపడిన 3వ స్థలం, 10. యేసు యొక్క వస్త్రాలు తీసివేయబడిన స్థలం, 11. యేసును సిలువకు మేకులతో కొట్టిన స్థలం, 12. యేసు చనిపోయిన స్థలం, 13. యేసును సిలువ నుండి క్రిందికి దించిన స్థలం, 14. యేసును సమాధిలో ఉంచిన స్థలం. పుస్తకము మధ్య పేజీలలోనున్న యెరూషలేము పట్టణ పటమందు యేసు నడిచి వెళ్ళిన మార్గం 14 ప్రాముఖ్య స్థలాలు చూపబడ్డాయి.

**యూదుల సమాజ మందిరములు :** యూదుల సమాజ మందిరములలో సబ్బాతు దినమైన శనివారము అనగా శుక్రవారము సాయంత్రము 6 గం॥ నుండి శనివారము సాయంత్రము 6 గం॥ వరకు యూదులు కూడుకొని ప్రార్థనలు చేయుదురు. మిగిలిన ఆరుదినాలలో సమాజమందిరములో పురుష

లకు, పిల్లలకు, పెద్దలకు ధర్మశాస్త్ర గ్రంథాలు నేర్పించెదరు. పాత నిబంధన లోని మొదటి ఐదు పుస్తకములు అనగా ఆదికాండము నుండి ద్వితీయోపదేశ కాండము వరకు గల ఐదు పుస్తకములను "తోర" అని పిలుచుదురు. ఈ గ్రంథము నేర్పించుటయే కాక 12 సం॥లలోపు తమ పిల్లలందరిచే కంఠోపాఠం చేయించెదరు. యూదుల స్త్రీలకు సైతం ధర్మశాస్త్రం నేర్పించు ప్రత్యేకమైన ఏర్పాట్లు ఇందు కలవు.

**ముఖ్యమైన కొండలుగా మోరీయా కొండ, సీయోను కొండ, ఒలీవల కొండ, గోల్గొతా కొండల వివరములు క్రింద చెప్పబడినవి.**

**(యెరూషలేము పట్టణ పటమందు ఈ కొండలు చూపబడినవి)**

**మోరీయా కొండ :** (M) ఈ కొండ యెరూషలేములో తూర్పు వైపున ఉండి సముద్ర మట్టమునకు 2500 అడుగుల ఎత్తున ఉన్నది. ఈ పర్వతముపై అబ్రాహాము ఇస్సాకును బలిగా ఇచ్చాడు. తదుపరి రాజైన దావీదు మందిర నిర్మాణము కొరకై స్థలము సిద్ధ పరిచాడు. రాజైన సొలొమోను దేవుని నామ ఘనత నిమిత్తము మందిరమును క్రీ.పూ. 967-960 మధ్య కట్టాడు. కాని మత్తయి 24:1, 2 ప్రకారం క్రీ.శ. 70 సం॥న రోమా చక్రవర్తియగు తీతు ద్వారా రాయి మీద రాయి నిలిచి యుండకుండ నాశనం చేయబడింది. సొలొమోను రాజు కట్టించి ఆలయ ప్రాకారపు క్రింది 3 వరుసల రాళ్ళు అక్కడ కూడా నేటికిని ఉన్నది. ఈ పుస్తకమందలి మధ్య పేజీలలోని పటములలో ఒక పెద్ద ప్రాకారపు రాయి పటము చూపబడినది. తదుపరి యెరూషలేము రోమా ప్రభుత్వపు రాజుల క్రింద ఉండగా క్రీ.శ. 312లో కాన్ స్టంటన్ చక్రవర్తి క్రైస్తవుడై తన తల్లియైన హెలినా ద్వారా పడిపోయిన ఇతర కట్టడములను కట్టించాడు కాని మత్తయి 24:1,2 ప్రకారం దీనిని కట్టించలేదు. క్రీ.శ. 600 వరకు

రాళ్ళకు అంటివున్న బంగారం నిమిత్తం అక్కడ పడిపోయిన రాళ్ళను ప్రజలు తీసుకొనిపోయిరి. క్రీ.శ. 617 సం॥మున మహమ్మద్‌గారు దేవాలయమున్న ఈ స్థలములోనుండి మనుష్య ముఖము గల గుఱ్ఱము పై ఒకరాత్రి పరలోకమందున్న అల్లా యొద్దకు వెళ్ళి ఖురాన్‌లో వ్రాయబడిన దేవుని వాక్కులను తీసుకొనివచ్చాడని మహమ్మదీయులు తలంచుదురు. రెండవదిగా అబ్రాహాము తన కుమారుడైన ఇష్మాయేలును ఈ స్థలమందే బలి ఇచ్చెనని మహమ్మదీయులు నమ్ముదురు.

పై రెండు కారణములనుబట్టి మహమ్మదీయులు 1 మక్కా, 2. మదీనాల తరువాత ఈ స్థలమును 3వ పవిత్ర స్థలంగా ఎంచిరి. క్రీ.శ. 632లో మహమ్మద్ చనిపోయాడు. ఆయన అనుచరులైన ఖలీఫాలు అన్ని రాజ్యములను జయించుచూ క్రీ.శ. 637లో యెరూషలేమును జయించిరి. తదుపరి మహమ్మదీయులు దానిని పాలించిరి. క్రీ.శ. 638 నుండి 687 వరకు మహమ్మదీయులు దీనిని ఒక పవిత్రస్థలంగా ఎంచి ప్రార్థనలు జరిపిరి. క్రీ.శ. 687లో అబ్దుల్‌మాలిక్ అను మహమ్మదీయ రాజు డోమ్ ఆఫ్ ది రాక్ అను పేరుతో ఓమార్ మాస్కు అని కూడా పిలువబడు ఒక మసీదును ముందున్న దేవాలయ ప్రాంత మంతటి మీద కట్టెను. ఈ కట్టడములో కొంతభాగము ఒకటి రెండు పర్యాయాలు భూకంపము ద్వారా దెబ్బతిన్నను క్రీ.శ. 1040లో సవరించబడినది. క్రీ.శ. 1938, 1943లో కూడా భూకంపం ద్వారా దెబ్బతినిన భాగములు సవరించ బడినవి. క్రీ.శ. 1951లో జోర్డాన్ రాజు అబ్దుల్లా ఈ మసీదు ద్వారం దగ్గర చంపబడెను. క్రీ.శ. 1969లో ఆస్ట్రేలియా దేశస్తుడొకడు మసీదు లోపల భాగమునకు నిప్పుపెట్టగా కొంతభాగం కాలిపోయి తదుపరి బాగు చేయబడినది. ప్రస్తుతము ఈ మసీదు వెలుపల ఉత్తర ప్రాంతమున మహమ్మదీయులు నివసించుచూ మసీదులో అనుదినము వాడుకగా ప్రార్థనలు జరుపు చున్నారు.

మసీదు పడమటి వైపు దక్షిణమున యూదులు నివసించుచున్నారు. యూదులు ఆలయపు పడమటి గోడ వెలుపల చేరి పడిపోయిన యెరూషలేము దేవాలయ విషయము ఏడ్చుచు కట్టుటకు సెలవిమ్మని యెహోవా దేవునికి ప్రార్థించుచున్నారు. దినమంతటిలోని 24 గం॥లు కూడా, సంవత్సరపు 365 దినములలో ఈ పడమటి గోడదగ్గర యూదులు ఏడ్చుచున్నారు. కనుక ఈ పడమటి గోడ వెయిలింగ్ వాల్ అని పిలువబడుచున్నది. ఈ పుస్తకమందలి మధ్య పేజీలలో వెయిలింగ్ వాల్ పటము చూపబడినది. ఈ డోమ్ ఆఫ్ ది రాక్ ప్రాంగణము 1967లో జరిగిన 7 దినముల యుద్ధము వరకు మహమ్మదీయుల పాలనలో ఉండెను. కాని 1967లో జరిగిన యుద్ధమందు యెరూషలేము పట్టణ మంతయు పూర్తిగా యూదులవశమైనది. కాని ఐక్యరాజ్యసమితి వారి ఆదేశ ప్రకారము మసీదు ప్రాంగణము మాత్రము యెరూషలేములో నివసించు మహమ్మదీయులకు ఇవ్వబడినది.

**సీయోను కొండ ($Z_1$, $Z_2$, $Z_3$) :** సీయోను కొండ చాల పెద్దదై యెరూషలేము పట్టణము యొక్క ఎక్కువభాగం కలిగిన కొండగా వున్నది. ఈ కొండకు తూర్పు వైపున టిరోఫియన్ లోయ కలదు. యెరూషలేము పట్టణ పడమటి వైపు హిన్నోములోయ కలదు. యెరూషలేము పట్టణము యొక్క పడమటి ప్రాకారము ఈ కొండపై కలదు. ఈ కొండ మధ్య తూర్పు పడమరగా ఒక లోయ కలదు. అందువలన ఈ కొండ రెండు భాగములుగా అనగా ఉత్తరపుకొండ, దక్షిణపు కొండగా ఉన్నది. ఉత్తరపు కొండపై మరొక కొండ ఉన్నందున, సీయోను కొండ 1. ఉత్తరపు కొండ $Z_3$, 2. మధ్య కొండ $Z_2$, 3. దక్షిణపు కొండ $Z_1$గా ఉన్నది. అనగా సీయోను కొండ మూడు కొండలుగా ఉన్నది. ఈ కొండపై నుండి పట్టణపు దక్షిణ దిక్కున బయటికి వచ్చుటకు సీయోను గుమ్మము అను పేరు గల ద్వారము కలదు. సీయోను గుమ్మమునకు

వెలుపట ప్రభు రాత్రి భోజనం చేసిన మేడగది కలదు. అపోస్తలుల కార్యములు 1,2 అధ్యాయాలలో 120 మంది ప్రార్థించిన మేడగది ఇదే. పరిశుద్ధాత్మడు పెంతెకోస్తు దినమున భూమి మీదికి దిగివచ్చినప్పుడు పేతురు సువార్త ప్రకటించగా నమ్మినవారు బాప్తీస్మము పొందుట, సంఘం ఏర్పడుట జరిగినందున ఆ మేడ గదిని ప్రపంచమంతటిలో ఉన్న సార్వత్రిక సంఘమునకు తల్లిగా ఎంచిరి. దీనికి సమీపములోనే శిష్యుడైన యోహానుతో కూడా యేసు తల్లియైన మరియ నివసించిన స్థలము, ఆమె సమాధి, దానిపై కట్టబడిన పరిశుద్ధ మేరి ఆలయము కలవు. సీయోను కొండపైనే రాజైన హేరోదు తన నివాసమును కట్టించుకున్నాడు. ఈ కొండపైనే యాజకుల నివాసములు, ప్రధాన యాజకులైన అన్న, కయపల నివాసములు ఉండెనని ముందుగా చూచితిమి. సీయోను కొండపైననే యెరూషలేము యొక్క ఎక్కువ భాగమున్నందున కొన్ని పర్యాయములు యెరూషలేము పట్టణము సీయోను అని పిలువబడుచున్నది. ఈ కొండపై పడమటి నుండి పట్టణపు జాఫా గుమ్మము గుండా యొప్పేకు పోవు రహదారి కలదు. ఈ కొండకు ఉత్తర దిక్కున ప్రస్తుతము క్రైస్తవులు నివసించు కాలని కలదు.

**దావీదు పురము లేదా సీయోను కోట అని పిలువబడు కొండ :** ఈ కొండ పై ముందుగా యెబూసీయులు నివసించిరి. న్యాయాధిపతులు 1:21లో సున్నట్లు ఇశ్రాయేలీయుల వారిని వెళ్ళగొట్టలేదు. కాని 2 సమూయేలు 5:7లో రాజైన దావీదు యెబుసీయులను హతము చేసి స్వాధీనపరచుకొని దానికి దావీదుపురమను పేరుపెట్టెను. దీని ఉత్తరదిక్కున టెరొఫియన్ లోయ దక్షిణ దిక్కున హిన్నోములోయ తూర్పుదిక్కున కిద్రోను లోయకలవు. కిద్రోను గుండా బేతనియ, ఎరికో పట్టణములకు వెళ్ళు మార్గము కలదు. ఇది దావీదు

తనకు నివాసముగా కట్టించుకున్న భవనముల ప్రాంతము. ఇందులోనే యూదా రాజుల సమాధులు కలవు.

**ఒలీవల కొండ (O) :** ఈ కొండ యెరూషలేమునకు తూర్పువైపున కిద్రోనులోయకు పైగా సముద్రపు మట్టమునకు 2700 అడుగుల ఎత్తున ఉన్నది. ఈ కొండకు తూర్పువైపు బేతనియ పట్టణం కలదు. బేతనియ యెరూషలేమునకు రెండు మైళ్ళు దూరమున ఉన్నది. ఈ కొండపై గెత్సేమనే స్థలములో యేసు ప్రభువు రాత్రి జాములలో ప్రార్థన చేయువాడు. ఈ కొండపై శిష్యుడైన యోహానుకు అనగా జెబెదయికి స్వంతమైన ఒలీవల చెట్ల తోట వున్నది. ఈ కొండమీదనే పడమటి వైపున శిష్యులకు "ప్రభువు ప్రార్థించు విధమును" అనగా పరలోకప్రార్థన నేర్పించాడు. ప్రభువు అప్పగించబడిన రాత్రి పేతురు, యాకోబు, యోహానులను వెంటపెట్టుకొని ఒక ఒలీవచెట్టు మొద్దు దగ్గర వారినివిడిచి రాతి వేత దూరమున ప్రార్థనలో గడిపెను. మధ్య పేజీలలోనున్న పటములలో ఈ చెట్టు చూపబడినది. శిష్యులు నిద్రించిన ఒలీవచెట్టు నేటికి ఉన్నది. ఒలీవల చెట్టుకొమ్మలు, రెమ్మలు ఎండిపోయినను వేరులు ఎండిపోక మొద్దులో నుండి క్రొత్తరెమ్మలు పుట్టుచూ కొమ్మలుగా ఎదుగుచుండును. ఒలీవలచెట్టు యొక్క మొద్దులు 2000 సం॥ నాటివైనను జీవము కలిగి ఉన్నాయి. ఇస్కరియోతు యూదా ప్రభువును పట్టించిన స్థలముపై ఒక ఆలయము కట్టబడింది. ఇక్కడనుండి ప్రధాన యాజకుడైన అన్నా ఇంటివరకు యేసును ఈడ్చుకొనిపోయిరని లూకా 22:54లో ఉన్నది. ఈ స్థలంనుండి యెరూషలేము దేవాలయం 1.4కి.మీ. దూరంలో మోరియా పర్వతము పై ఉన్నందునను, ఇక్కడ నుండి ప్రధాన యాజకుని ఇల్లు సీయోను కొండమీద 1.5 కి.మీ. దూరమున వున్నందుననూ గెత్సేమనే నుండి ఒలీవల కొండ క్రిందకున్న కిద్రోను మార్గమున మోరీయా కొండపైకి, ఆ కొండ దిగువ

నున్న టెరోఫియన్ లోయ గుండా సీయోను కొండపైనున్న ప్రధాన యాజకుని ఇంటికి W ఆకారముగానుండు మార్గము షుమారు 3.కి. మీ. దూరము. రాత్రివేళ కొండల మీదనున్న రాళ్ళ మధ్య యేసు ఈడ్వబడెను.

ఇక్కడ నుండి టెరోపియన్ లోయ గుండా పిలాతు అధికార మందిరము దగ్గరికి, అక్కడ నుండి హేరోదు యొద్దకు, మరలా పిలాతు యొద్దకు తీసుకొని పోబడెను. ఆ సమయములో ఆయన (కీర్తన 129:3) "దున్నువారు నా వీపు మీద దున్నిరి. వారు చాళ్ళను పొడుగుగా చేసిరి" అని చెప్పిన లేఖనమును బట్టి ఆయన శరీరము, అనగా పైనున్న చర్మము, మాంసము చీలిన సంగతిని అర్థము చేసుకోగలము. ఒలీవల కొండ పీద ఎత్తైన భాగము నుండి యేసు ప్రభువు అరోహణమై పరమునకు చేర్చుకొనబడెను. ఈ ఆరోహణమైన స్థలముపై ఒక దేవాలయము కట్టబడినది. అ.కా. 1:11 వున్నట్టు ఈ కొండపైకి ప్రభువు మరలా తన రెండవ రాకడలో దిగివచ్చునని నమ్ముచున్నాము.

**గొల్గొతా కొండ (T) :** గొల్గొతా అనే హెబ్రీ పదమునకు, కల్వరి అను లాతిన్ పదమునకు, కపాలము అని అర్థము. ఈ స్థలము యెరూషలేము పట్టనమునకు ఉత్తరముగా దమస్కు గుమ్మము గుండా దమస్కు పట్టణమునకు వెళ్ళు రహదారిలో యెరూషలేము పట్టణ ప్రకారమునకు 700 అడుగుల సమీపములో ఉన్నది. దీనికి మానవ కపాలపు ఆకారం కలదు. ఈ కొండపై యేసు సిలువ మీద వ్రేలాడదీయబడి చనిపోయెను. వ్రేలాడదీసి చంపు అలవాటు యూదులకు లేదు. ఇది రోమీయులు శిక్షించు విధానము. ధర్మశాస్త్రములో ద్వితీయోపదేశ కాండములో (21:23) మ్రానుమీద వ్రేలాడ దీయబడినవాడు శాపగ్రస్తుడు అని వ్రాయబడినట్టు ధర్మశాస్త్రము నెరవేరునట్లుగా కల్వరికొండపై వ్రేలాడదీయ బడి చనిపోయెను. సమీపములో ఉన్న అరిమతయి ద్రాక్షతోటలో అరిమతయి యోసేపు తన కొరకై తొలిపించుకొనిన రాతి సమాధిలో మత్తయి

27:60 ప్రకారం సమాధి చేయబడెను. కాని ప్రభువు తిరిగి లేచినందున ఆ సమాధి ఖాళీగా నేటికి ఉన్నట్లు చూడగలం.

ఒలీవల కొండ మీద నుండి ఈడ్వబడగా మోరీయా కొండ, సీయోను కొండ, కల్వరి కొండలపై చిందిన యేసు రక్తము ఎందుకు చిందించబడినది? ఆయన శరీరమంతయు దున్నబడినట్లు ఎందుకు గాయపరచబడినది? క్రీస్తు తన శరీరమందు ఎందుకు అన్ని పాట్లుపడిరి? అని ఈ గ్రంథమును చదువు వారు ఆలోచించ తగినది.

"యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" అని 1 యోహాను 1:7లో వ్రాయబడినది.

"మన అతిక్రమ క్రియలనుబట్టి గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీదపడెను. అతడు పొందిన దెబ్బల ద్వారా మనకు స్వస్థత కలుగుచున్నది" యెషయా 53:5.


నీ పాప క్షమాపణ కొరకై గాయపరచబడిన యేసు, రక్తము చిందించిన యేసును ఆశ్రయించి పాప క్షమాపణ పొందితిరా లేదా? ఇది ప్రాముఖ్యమైన అంశము.

రెండవదిగా క్రీస్తు "సంఘము అను ఆయన శరీరము కొరకు పాట్లు పడెను. అందులో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను". కొలస్సై 1:24. ప్రభువు నందు జీవించు ప్రతి ఒక్కరు సంఘము యొక్క క్షేమము కొరకు పాట్లు పడవలెనని నేర్చుకొనుట రెండవ ప్రాముఖ్యమైన అంశము.

గెత్సేమనే - ప్రభువు ప్రార్థించిన స్థలము



ఒలీవల కొండ



ఆరోహణమైన స్థలము




ఒలీవల కొండ
యేసు ప్రభువు ప్రార్థించిన ఒలీవ చెట్టు



మృతసముద్రములో నీటిపై తేలుట


గలిలయ సముద్రము


సీమోను, అంద్రెయను
యేసు పిలిచినది ఇక్కడే








అపవిత్రాత్మను వెళ్లగొట్టిన కపెర్నహూములోని సమాజ మందిరం (మార్కు 1:21)
(13 వ పేజి)


కపెర్నహూము పట్టణము
CAPHARNAUM
THE TOWN OF
JESUS


పొలములో గొర్రెలు
Shepard's Field


యెరూషలేము దేవాలయ ప్రాకార పడమటి గోడ - యూదులు ఏడ్చుట
Wailing wall


యెరూషలేము మందిర
దక్షిణ ప్రాకారము
సొలొమోను కాలపునాటి
పునాది రాయి




యేసు జీవితపు చివరి వారములో యెరూషలేములోనికి ప్రవేశించిన బంగారు గుమ్మము (ప్రస్తుతము మూయబడినది)

(29వ పేజి)



(29 వ పేజి)

స్తెఫను యెరూషలేము పట్టణము వెలుపల రాళ్లచేత కొట్టబడి చనిపోయిన సింహపు గుమ్మము (అపో 7:59)




ప్రభురాత్రి భోజనం చేసిన యెరూషలేము
సీయోను కొండ పైనున్న మేడ గది (35 వ పేజి)



క్రీ.శ. 1947 లో బైబిల్ భాగములు దొరికిన కామరాన్ గుహలు (25 వ పేజి)

# యెరూషలేము పట్టణ పటము




కల్వరి కొండ
లోపట
వెలుపట
యేసు ప్రభువు ఖాళీ సమాధి